
పూజల్లో పాల్గొన్న చిన్నారులు

30 వేల మంది విద్యార్థులతో సరస్వతీ పూజ

కాకినాడ గ్రామీణంలోని రమణయ్యపేట శ్రీపీఠంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని ఐశ్వర్యాంబికను సరస్వతీ దేవిగా అలంకరించారు. 30 వేల మంది విద్యార్థులతో ఉచిత త్రికోటి సరస్వతి పూజలు, 200 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. మేధాసూక్త సరస్వతి హోమం, లక్ష ఫలార్చణ నిర్వహించారు. వీణాపాణి అనుగ్రహం ప్రతి విద్యార్థిపై ఉండాలని స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆకాంక్షించారు. ప్రముఖ కవి, ఆధ్యాత్మికవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు అనుగ్రహభాషణ చేశారు. **-న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్**

పూచీకత్తుపై బియ్యం విడుదల

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో పౌరసరఫరాల శాఖ పట్టుకున్న రేషన్ బియ్యం విడుదలకు చర్యలు చేపట్టారు. గతంలో 13 గోదాముల్లో రూ.8.73 కోట్ల విలువైన 25,386 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై నమోదైన కేసులు తేలేసరికి బియ్యం పాడైపోయే అవకాశం ఉండటంతో బియ్యం విలువకు సమానమైన బ్యాంకు పూచీకత్తులు సమర్పించి విడిపించుకుంటున్నారు.



నయనం.. నయా కష్టం

నేడు ప్రపంచ కంటిచూపు ప్రాముఖ్యత దినం

ఈనాడు, కాకినాడ

తరచూ తలనొప్పి వస్తోంది.. కళ్లు పొడిబారుతున్నాయి.. మంట.. ఎర్రగా మారి నేత్రాలు దురద పెడుతున్నాయి. చూపు మసకబారుతోంది.. ఎక్కువ మందిలో కనిపిస్తున్న ఇబ్బందులివి. వృద్ధాప్యంలో చూపు మందగించడం సహజం.. ఇప్పుడు చిన్నారుల్లో సైతం దృష్టిలోపాలు దర్శనమిస్తున్నాయి. కారణం స్మార్ట్ వ్యసనం.. మొబైల్, ట్యాబ్‌లు, కంప్యూటర్లు, టీవీలను గంటలకొద్దీ చూడడమే అంటున్నారు నిపుణులు.

ఆసుపత్రులకు వస్తున్న కేసుల్లో..

కళ్లు మసకబారడంతో వచ్చేవారు 60, పొడిబారడం 20, తలనొప్పి 10, కళ్ల నుంచి నీరుకారడం వంటి సమస్యలతో వచ్చేవారు 5 శాతం ఉన్నారు.

- ఉమ్మడి జిల్లాలో కంటిశుక్లాలతో బాధపడేవారు 62 శాతం ఉండగా వక్రీభవన లోపాలతో 20, గ్లకోమా 6, జన్యుపరమైనవి 6.5, కంటి పొర 4.5, శస్త్రచికిత్సలు జరిగాక ఇబ్బందులు పడేవారు 1 శాతం ఉన్నారు.


పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు (పాత చిత్రం)

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద.. (అక్టోబర్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు)

విషయం	కాకినాడ	తూర్పు గోదావరి	అంబేడ్కర్ కోనసీమ
నేత్ర శస్త్రచికిత్సలు	1,960	1,624	1,124
కళ్లజోళ్ల లబ్ధిదారులు	26,420	28,429	32,359

వీటితో మేలు

- క్యారట్, క్యాప్సికం, పాలకూర, చిలగడదుంప, నారింజ, బొప్పాయి, కర్బూజా, చేపలు, పీతలు, మాంసం, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, వేయించిన సోయాబీన్స్ కంటికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.
- ప్రతి 20 నిమిషాలకోసారి కళ్లకు విశ్రాంతి ఇవ్వడం.. 20 అడుగుల దూరం ఉన్న వస్తువులను 20 సెకన్లపాటు చూడడం. . రెప్పలు ఆడించడం వంటివి చేయాలి. వీలైతే కంప్యూటర్, మొబైల్‌లో ఫాంట్స్ పెద్దవిగా చేసుకుని చూడడం, యాంటీగ్లేర్ వంటి రక్షణ ఇచ్చే కళ్లద్దాలు వాడడం వంటి ప్రక్రియలతో కంటిపై ఒత్తిడి తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.

పాఠశాలల్లో నేత్ర పరీక్షల తీరిదీ.. (ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు..)

విషయం	కాకినాడ	తూర్పు గోదావరి	అంబేడ్కర్ కోనసీమ
శిబిరాలు జరిగిన పాఠశాలలు	215	74	131
కంటి పరీక్షలు	24,199	10,383	19,461
కళ్లద్దాలు అవసరమైనవారు	1,150	327	772
ఇతర నేత్ర సమస్యలతో..	29	23	6

కంటిపై ఒత్తిడి తగదు..



కంటిపై ఒత్తిడి పెరిగితే అనర్థాలే.. 40 ఏళ్ల వయసు దాటితే దృష్టిలోపం రావడం సహజం. కానీ ఇప్పుడు చిన్న పిల్లలు, యువతలోనూ సమస్యలు ఎక్కువవుతున్నాయి. స్క్రీన్ టైం పెరగడంతో వచ్చే ఇబ్బంది ఇది. పాఠశాలల్లో నేత్ర సర్వే ద్వారా సమస్యలు గుర్తించాం. ప్రత్యేక శిబిరాల్లో పెద్దల్లోనూ కంటి ఇబ్బందులు గుర్తించి శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు అందిస్తున్నాం. 60 ఏళ్లు దాటిన వారిలో శుక్లాల సమస్య ఉంటే ముదిరిపోకుండా శస్త్రచికిత్స చేసుకోవడం మేలు.

- డాక్టర్ పి.వి.ప్రసాద్, ప్రోగ్రాం మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ, కాకినాడ జిల్లా

కాపాడుకుందాం..

ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు కాకినాడ జిల్లాలో 3.48 లక్షల మంది విద్యార్థులుంటే.. తూర్పుగోదావరిలో 3.14 లక్షల మంది, కోనసీమలో 2.41 లక్షల మంది ఉన్నారు. స్క్రీన్‌టైం పెరగడం వీరిలో సమస్యకు ప్రధాన కారణమవుతోంది. 'సి' విటమిన్ లోపించడం, హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్, మధుమేహానికి తోడు కంప్యూటర్, మొబైల్, టీవీ ముందు ఎక్కువ సేపు గడపడం ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

రైతుకు అండ



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం బస్తాను తూకం వేసి చూస్తున్న మనోహర్.. చిత్రంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి, కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు. **-న్యూస్‌టుడే, చాగల్లు**

ఆలయానికి రూ.30 లక్షల భూమి వితరణ

గాంధీనగర్: బాలాత్రిపుర సుందరి అమ్మవారికి నగరానికి చెందిన రెడ్డి ఆదిమూర్తి, అనురాధ దంపతులు అరెకరం భూమి దానం చేశారు. వారికి జగ్గంపేట మండలం కాండ్రేగులలో అరెకరం వ్యవసాయ భూమి ఉంది. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా దాత దంపతులు పత్రాలను ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరికి ఇచ్చారు. ఈవో మాట్లాడుతూ భూమి విలువ సుమారు రూ.30 లక్షల పైమాటే అన్నారు. రెడ్డి ఆదిమూర్తి, అనురాధ దంపతులు మాట్లాడుతూ అమ్మవారిపై భక్తితో చిరు కానుకగా ఇచ్చామన్నారు. గ్రంధి బాబ్జి, నేమాని సత్యనారాయణ, ముత్యాల రాణి, నల్లూరి శ్రీనివాసు దంపతులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చేతులమీదుగా పట్టా ఇస్తున్న దాతలు

ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్: ప్రజా ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. బుధవారం ఆయన ప్రజా ఫిర్యాదులపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గత 15 రోజుల్లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన వినతులపై సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు మరిన్ని పనిదినాలు కల్పించాలన్నారు.

ప్రత్యేక కేంద్రాల్లో తక్కువ ధరకు నిత్యావసరాలు

కాకినాడ కలెక్టరేట్: పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో రైతుబజార్లు, మండల కేంద్రాలు, మాల్స్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాలిచ్చారు. బుధవారం గాంధీనగర్ రైతు బజారు ప్రత్యేక కౌంటరులో వంట నూనెల విక్రయాలను ఆయన ప్రారంభించారు. గురువారం నుంచి మరిన్ని కేంద్రాల ద్వారా వంటనూనెలు, టామాటా, ఉల్లి విక్రయించనున్నట్లు తెలిపారు. నిత్యావసర సరకుల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు.

టెట్‌కు 1,631 మంది హాజరు

కాకినాడ నగరం: జిల్లాలో బుధవారం జరిగిన టెట్ పరీక్షకు 151 మంది గైర్హాజరయ్యారు. 1,782 మంది హాజరు కావాల్సి ఉండగా 1,631 మంది రాసినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.

ఉన్నత విద్యకు 'ప్రతిభ' ఉపకార వేతనాలు

నవంబరు 11 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ప్రతిభకు పేదరికం అడ్డుకాదనే లక్ష్యంతో ప్రవాస భారతీయుడు వల్లభనేని రమేష్ 2012లో 'ప్రతిభ స్కాలర్‌షిప్ ట్రస్ట్' స్థాపించారని కార్యదర్శి ఎండీ ఇబ్రహీం ఖాన్ బుధవారం తెలిపారు. ఐఐటీ, నీట్, జేఈఈ, ఇంజినీరింగ్, మెడిసిన్ 2024- 25లో ప్రవేశం పొందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రతిభావంతులను ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఉపకార వేతనం అందిస్తామన్నారు. ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి, పేదరిక కుటుంబంలోని ప్రాధాన్యమయ్యే వారికి కోర్సు పూర్తయ్యేంతవరకు స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ప్రతిభస్కాలర్‌షిప్.కామ్ వెబ్‌సైట్ నుంచి తీసుకుని నవంబరు 11లోపు పంపాలన్నారు. దరఖాస్తులను వరుపుల చిట్టిబాబు, శ్రీ గణపతి వెంకట సత్యసాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏలేశ్వరం, 533429 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 9951367872, 9948417174 నంబర్లను సంప్రదించాలి.

నష్ట పరిహారం కోసం చెట్టెక్కి నిరసన


పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం మండలం గోకివాడ గ్రామంలో ఏలేరు వరదల కారణంగా కౌలురైతు నామా సూరిబాబుకు చెందిన తొమ్మిది ఎకరాల పంట దెబ్బతింది. నష్టపరిహారం వివరాలు నమోదు చేసే సమయంలో వ్యవసాయాధికారులకు అన్ని పత్రాలు అందించినా పరిహారం పూర్తి స్థాయిలో అందలేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం తన పొలంలోని చింతచెట్టెక్కి నిరసన తెలిపారు. గత నెల 25నే రైతుకు పరిహారం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమయినప్పటికీ, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న గ్రామపెద్దలు, వ్యవసాయాధికారులు, పోలీసులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏవో అచ్యుతరావు మాట్లాడుతూ కౌలురైతు సూరిబాబుకు సాంకేతిక కారణాలతో పరిహారం జమకాలేదని చెప్పారు. వాటిని పరిష్కరించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆయన చెట్టు దిగి కిందకి వచ్చారు.


చెట్టుపై సూరిబాబు

ఒత్తిడిని జయిద్దాం.. సమస్యను తరిమేద్దాం

☛ గంజాయికి బానిసలైన తుని పట్టణానికి చెందిన కొందరు యువకులు అది దొరకని పరిస్థితుల్లో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై గొడవలు, దాడులకు దిగారు. కొంతకాలం క్రితం ఎస్‌ఏరోడ్డులోని ఓ కొబ్బరిబొండాలు అమ్మే వ్యక్తిని, అతని కుమారుని చితకబాదారు. వీరిని పట్టుకుని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

☛ కాకినాడకు చెందిన 16 ఏళ్ల బాలిక 10వ తరగతి తప్పడంతో చదువు మానేసి ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతూ మందులు వాడుతోంది. తనలో తాను మాట్లాడుకోవడం, చెప్పాపెట్టకుండా ఉండటం కుటుంబ సభ్యులతో చెప్పేది. ఈ క్రమంలో ఇటీవల చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది.



మసీదు సెంటర్ (కాకినాడ), తుని, న్యూస్‌టుడే: ఆధునిక పోటీ ప్రపంచంలో మనిషి నిత్యం కాలంతో పరుగు పెట్టాల్సిన అవసరం పెరగడంతో తీవ్ర ఒత్తిడికి గురికావాల్సి వస్తోంది. ప్రస్తుత కాలంలో ఆర్థిక, సామాజిక, శారీరక ఇలా వివిధ కారణాలతో ఎక్కువ మంది మానసిక అనారోగ్యంతో అనేకమంది బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి వివిధ రూపాల్లో చిన్నా పెద్దా అందరిని కుంగదీస్తున్న ప్రధాన సమస్య.

ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు ఇలా చేద్దాం

- సూర్యోదయానికి ముందే లేచి వ్యాయామం, యోగా చేయాలి.
- ఆల్కహాలు, పొగాకు, మసాలాలు వాడిన పదార్థాలు తగ్గించాలి.
- పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలున్న ఆహారం తీసుకోవాలి.
- బంధుమిత్రులతో సమయం గడపాలి.
- క్రీడలు, చిత్రలేఖనం, కథలు, వ్యాసాలు రాయడం వంటి వాటిని అలవాటు చేసుకోవాలి.
- పిల్లలు సెల్‌ఫోన్ వినియోగించకుండా ఉండేందుకు వారికి చదువు, ఆటపాటలతో పాటు ఇంటి పనులు కూడా అలవాటు చేయాలి.
- విహార యాత్రలకు వెళ్లడం, సినిమాలు చూడటం, పుస్తకాలు చదవడం మానసికోల్లాసానికి దోహదపడతాయి.

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మనోవ్యాధికి మందు లేదనేది అపోహ...



మనోవ్యాధికి మందు లేదనేది అపోహ మాత్రమే. చాలావరకు మానసిక సమస్యలు మెదడులోని రసాయనిక మార్పుల వల్ల వస్తాయి. కాబట్టి మందులతో చాలా వరకు నయం అవుతాయి. కౌన్సెలింగ్ ద్వారా మరికొన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
- డా.వరప్రసాద్, జీజీహెచ్ మానసిక వైద్యనిపుణులు

ఆహ్లాదకర వాతావరణంలో పని..



ఆరోగ్యకరమైన, భద్రత కలిగిన వాతావరణం పని ప్రదేశాల్లో కల్పించినప్పుడే ఎక్కువ ఉత్పాదకత సాధించి దేశం ఆర్థికంగా వృద్ధి చెందుతుంది. ఉద్యోగ కల్పన, ఒత్తిడి రహితమైన పని పరిస్థితిని కల్పించే బాధ్యత ప్రభుత్వం, యాజమాన్య సంస్థలు తీసుకోవాలి. పని వల్ల కలిగే తీవ్ర ఒత్తిడి వల్లే మానసిక ఆరోగ్యం దెబ్బతింటోంది.
- డా. గోదవర్తి సత్యమూర్తి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, కాకినాడ

413 మద్యం దుకాణాలు.. 7,350 దరఖాస్తులు

ఈనాడు, కాకినాడ: ఉమ్మడి జిల్లాలో 413 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ ఇవ్వగా బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 7,350 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం ఈనెల 11 వరకు గడువు పొడిగించింది. 14న లాటరీ తీసి లైసెన్సులు ఖరారుచేస్తారు. 16 నుంచి దుకాణాలు ప్రారంభించుకునే వెసులుబాటు కల్పిస్తారు. దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

దుకాణాలు తక్కువగా ఉన్న తూర్పుగోదావరిలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాతి స్థానంలో కోనసీమ ఉంది. అత్యధికంగా మంజూరైన కాకినాడలో దరఖాస్తులు తక్కువగా రావడం చూస్తే రాజకీయ జోక్యం, గతంలో ఈ వ్యాపారంమీద పట్టు ఉన్నవారు దక్కించుకోడానికి సిండికేట్ వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు (9వ తేదీ నాటికి)
కాకినాడ	155	1,716
తూర్పుగోదావరి	125	2,896
అంబేడ్కర్ కోనసీమ	133	2,738


కాకినాడలోని అబ్కారీశాఖ కార్యాలయం

★ కోనసీమ జిల్లాలో 121వ దుకాణానికి కేవలం రెండు, 125వ దుకాణానికి మూడు దరఖాస్తులే రావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధికంగా 66వ నంబర్ దుకాణానికి 45, నాలుగో నంబరుకు 44, రెండో నంబరు దుకాణానికి 41 చొప్పున వచ్చాయి.

★ తూర్పుగోదావరిలో అత్యల్పంగా 30వ దుకాణానికి మూడు, 29కి నాలుగు చొప్పున.. 37, 100వ దుకాణానికి ఏడు చొప్పున... 1, 32, 35 దుకాణాలకు ఎనిమిది చొప్పున వచ్చాయి. 2, 3, 4, 5, 13, 18, 26, 101, 104, 105 దుకాణాలకు తొమ్మిది చొప్పున దరఖాస్తులు అందాయి. ఇక్కడా సిండికేట్ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా 46వ నంబర్ దుకాణానికి 54 దరఖాస్తులు వచ్చాయి.. 55వ దుకాణానికి 46 రాగా 47, 72, 83, 87 దుకాణాలకు 44 చొప్పున అందాయి.

★ కాకినాడ జిల్లాలో 132వ దుకాణానికి 26 దరఖాస్తులు వస్తే.. 37, 45, 112, 130 దుకాణాలకు 25 చొప్పున వచ్చాయి. 121వ నంబరుకు కేవలం రెండు అందగా.. 89, 117, 120 నంబర్లకు మూడు చొప్పున వచ్చాయి. 88, 118, 119, 151, 153 దుకాణాలకు నాలుగు చొప్పున వచ్చాయి. 67, 69, 72, 90, 139చ 140, 141, 152 దుకాణాలకు 5 చొప్పున.. 19, 65,68, 70, 71, 91, 124, 145, 147 దుకాణాలకు ఆరు చొప్పున రావడం గమనార్హం. జిల్లాలో 15 చోట్ల దుకాణాలకు ఏడేసి, 12 చోట్ల ఎనిమిదేసి, 16 చోట్ల తొమ్మిదేసి చొప్పున మాత్రమే అందాయి.



కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక బందోబస్తు

కిర్లంపూడి: ఎన్‌హెచ్ వెంబడి వెళ్తున్న వాహనాల్లో మాదకద్రవ్యాలు, గంజాయి, ఇతర స్మగ్లింగ్ వస్తువులు అక్రమ మార్గంలో తరలించడాన్ని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక బందోబస్తు చేపట్టినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలోని మూడు స్టేషన్ల సిబ్బందిని టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసి ఐదు వాహనాల్లో పహారా కాస్తారని సీఐ తెలిపారు.

'వైకాపా వైఫల్యాలతో అభివృద్ధిపై ప్రభావం'

కాకినాడ నగరం: గత వైకాపా ప్రభుత్వ వైఫల్యాలతోనే కూటమి ప్రభుత్వ హయాంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై ప్రభావం పడిందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు ఆరోపించారు. గత అయిదేళ్ల వైకాపా పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో బుధవారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి యనమల మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. వారి ఆశల మేరకు ఒక్కొక్కటి నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు రావాలన్నారు. గత తెదేపా పాలనలో 10.20 శాతం ఆర్థిక అభివృద్ధి ఉండగా, వైకాపా పాలనలో అది నాలుగు శాతానికి పడిపోయిందన్నారు. వైకాపా పాలనలో కేవలం ఆ పార్టీ నాయకులే బాగుపడ్డారన్నారు. ప్రజలకు అప్పులే మిగిలాయన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత అరాచక వైకాపా పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి జరుగుతోందన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక మనకి ప్రతిష్ఠాత్మకం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా తరఫున పోటీ చేసే అభ్యర్థిని గెలిపించుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కూటమి నాయకులు నిర్ణయించారు. కాకినాడ రామారావుపేటలోని జిల్లా తెదేపా కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షత వహించగా, పరిశీలకునిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని తెదేపా అధినేత చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు. తనను గెలిపించుకునేందుకు ఓట్ల నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. మూడు పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిని నిలపలేదన్నారు. యువత, కూటమి సానుభూతి పరులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, దాట్ల బుచ్చిబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, వరుపుల సత్యప్రభ, పంతం నానాజీ, మిరియాల శిరీష, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, పెందుర్తి వెంకటేష్, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, జిల్లా భాజపా అధ్యక్షుడు రామ్‌కుమార్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మోకా ఆనందసాగర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో యనమల, చినరాజప్ప, తదితరులు

మద్యం మాఫియాపై రెండోరోజూ దాడులు

కీలక వ్యక్తిని గుర్తించేందుకు నిఘా

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమార్కుల విచ్చలవిడితనానికి తుని మండలం కేంద్రంగా మారింది. గోవాకు చెందిన చీప్‌లిక్కర్‌ను అనధికారకంగా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మంగళవారం రాత్రి తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణామాచారి ప్రత్యేక నిఘా పెట్టి ఎస్.అన్నవరం పరిధిలోని ఒక ఇంటిలో సుమారు రూ.2.48 లక్షలు విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. దీన్ని కొనసాగిస్తూ బుధవారం తెల్లవారుజామున కేవో మల్లవరంలో ఒక ఇంటి వద్ద 94, మరో ఇంటి వద్ద 72 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. మంగళవారం పట్టుబడిన మద్యం ఖమ్మం జిల్లా నుంచి వచ్చినట్లు సమాచారం ఉందని వారు తెలిపారు. అక్కడ స్థానికంగా స్పిరిట్‌తో తయారుచేసి అక్రమంగా తరలించి విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం ఉండటంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు కొనసాగిస్తున్నామన్నారు. అక్రమ మద్యం బయటపడటంతో ఈ మద్యం మాఫియా వెనుక ఉన్న నాయకుడు ఎవరు అనేది స్థానికంగా చర్చనీయాంశమైంది. మద్యం మాఫియాను నడుపుతున్న వారిని గుర్తించేందుకు పోలీసులు డేగకన్ను వేశారు. నిర్వాహకులు ఎంతటివారైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సీసాలు

బాలిక అపహరణ, అత్యాచారం కేసులో నిందితుడు, ఓ మహిళ అరెస్టు

పిఠాపురం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పిఠాపురంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడు, అతనికి సహకరించిన మహిళను పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం పిఠాపురం పట్టణ సీఐ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన బాలికను అపహరించి ఆటోలో మాధవపురం రోడ్డులోని గోదావరి కాలువగట్టు వద్దకు తీసుకువెళ్లి ఆమెతో మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. తక్షణమే కేసు నమోదు చేశామని.. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో నిందితులను పట్టుకోవడానికి పట్టణ ఎస్సై మణికుమార్, గ్రామీణ ఎస్సై గుణశేఖర్, గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణలతో మూడు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని అయితేనగర్‌కు చెందిన నిందితుడు దుర్గాడ లక్ష్మయ్య అలియాస్ జాన్, అతడి స్నేహితురాలు రథాలపేటకు చెందిన కొంగుపూడి సుబ్బలక్ష్మిని బుధవారం అరెస్టు చేశామన్నారు.

ఇప్పటికే పార్టీ నుంచి తొలగించిన తెదేపా..

నిందితుడు జాన్ పిఠాపురం పట్టణంలోని తెదేపా మహిళా నాయకురాలి భర్త. తెదేపా కార్యకర్త కూడా అయిన అతన్ని పార్టీ అధిష్ఠానం మంగళవారమే పార్టీ నుంచి తొలగించింది.


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 40, వంకాయలు - 44, 46, 64, బెండకాయలు - 42, పచ్చిమిర్చి - 28, 36, కాకరకాయ - 36, బీర - 50, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 46, దొండకాయలు - 40, బంగాళాదుంపలు - 30, 34, ఉల్లి - 46, 50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 40, ఆనపకాయ - 35,40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 66, 100, చేమదుంపలు - 30, 40, మునగకాడలు - 10,12, బీట్‌రూట్ - 38, కీరదోస - 30, బీన్స్‌గింజలు - 130, అల్లం - 55, క్యాప్సికం - 80, బొబ్బర్లు - 44, చిలకడదుంపలు - 40, మామిడికాయ - 18,20, నిమ్మకాయలు(డజన్) - 24,54.

నగరంలో సినిమాలు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- వెట్టయ్యాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, జనక అయితే గనక, దక్షిణ, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- వెట్టయ్యాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, సత్యం సుందరం, కాళీ, లక్ష్మి- దేవర పార్ట్ 1, సత్యగౌరి- బఘీరా, తిరుమల - వెట్టయ్యాన్ ది హంటర్, సిటీసెంటర్ 1- మత్తువదలరా 2, సిటీసెంటర్ 2- శ్వాగ్, శ్రీప్రియ - వెట్టయ్యాన్ ది హంటర్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- మిస్టర్ సెలబ్రిటీ, శ్రీనివాసా(వేలంగి)- వెట్టయ్యాన్ ది హంటర్.

అంతా గోప్యమే..!
అవినీతి ఆరోపణలతో అధికారుల అరెస్టులు, బదిలీలు

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలోని ఇద్దరు కీలక అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టు చేయడం కలకలం రేపింది. ప్రాథమికంగా ఈ వ్యవహారంలో పాత్రధారులైన వారిని బదిలీ చేశారు. కాకినాడ పోర్టు ద్వారా జరిగే ఎగుమతులు, దిగుమతుల్లో అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటుచేసిన ఈ కార్యాలయంలో అధికారులు తీరు, కార్యకలాపాలు గోప్యంగా సాగుతున్నాయి. కొన్నిసార్లు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. విశాఖపట్నం నుంచి వచ్చిన సీబీఐ, అవినీతి నిరోధక శాఖ అధికారులకు పెద్దఎత్తున నగదుతో కస్టమ్స్ సూపరింటెండెంట్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి పట్టుబడటం సంచలనం రేపింది. వీరిని విశాఖపట్నం సీబీఐ న్యాయస్థానంలో ఆదివారం హాజరుపర్చిన అనంతరం రిమాండుకు తరలించారు. ఆపై బదిలీ చేశారు. ఈ ఘటనతో కాకినాడ కస్టమ్స్ కార్యాలయ అధికారుల్లో గుబులు మొదలైంది. పోర్టు ఆధారంగా జరిగే సెంట్రల్ కస్టమ్స్ కార్యాలయంలో కొన్నేళ్లుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి.


కాకినాడ కస్టమ్స్ కార్యాలయం

దాణా పేరుతో జీడిపప్పు దిగుమతి..

గతంలో ఎన్నడూ లేనివిధంగా హోదా కలిగిన అధికారులు పట్టుబడటంతో మరింత మంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు వెల్లడవుతోంది. ఇటీవల వియత్నాం నుంచి పశువుల దాణా పేరుతో కంటైనర్ల ద్వారా పెద్దఎత్తున జీడిపప్పు దిగుమతి అవడం గమనార్హం. ఈ వ్యవహారంలో పన్ను ఎగవేతకు పాల్పడ్డారనే ఆరోపణలతో పోర్టులోని కస్టమ్స్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నా విషయం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు. దీనిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు కార్యాలయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఏదైనా అక్రమ సరకు పట్టుబడినా తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లావాదేవీలకు సంబంధించి పలు పరిశ్రమల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుత పరిణామాలు కస్టమ్స్ అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.

నేడు డయల్ యువర్ డీఎం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ ఆర్టీసీ బస్టాండులో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటలవరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 99592 25534 నంబరుకు తెలియజేయాలని కోరారు.

అద్దెకు చెల్లు.. రూ.లక్షల్లో మిగులు
చెత్త తరలింపునకు సొంత వాహనాలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జగన్ ప్రభుత్వం చెత్తపన్ను పేరుతో ప్రజల నెత్తిన భారం మోపింది. ప్రైవేటు సంస్థకు చెందిన హాపర్ టిప్పర్ వాహనాలతో ఇంటింటా చెత్త సేకరణ చేపట్టింది. వీటికి నెలకు రూ.56 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. చెత్తపన్ను రద్దుతో ఈ భారం కాకినాడ నగరపాలక సంస్థ తలకుమించిన భారంగా పరిణమించింది. దీని నుంచి బయటపడేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వాహనాలకు ప్రతినెలా ప్రభుత్వం చెల్లించే బదులు సొంతంగానే కొన్ని వాహనాలు సమకూర్చుకోవాలని నగరపాలక సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే 14 శానిటేషన్ సర్కిళ్లకు 15 చొప్పున ట్రాక్టర్లు, కాంపాక్టర్లు ఉన్నాయి. డంపర్ బిన్నులు, పుష్ కార్టులు, 60 లీటర్ల సామర్థ్యంతో డబ్బాలు, 1,100 పారిశుద్ధ్య కార్మికులు, తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రం అందుబాటులో ఉంది. అదనపు వనరులకు ప్రతిపాదనలు పంపారు.

రూ.9.75 కోట్లతో పనులకు ప్రతిపాదనలు



'హాపర్ టిప్పర్' మహిమ

పారిశుద్ధ్యానికి పెద్దపీట అంటూ వైకాపా హయాంలో చెత్త సేకరణకు హాపర్ టిప్పర్ వాహనాలు తీసుకొచ్చారు. అవి రాకముందు తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాల సేకరణ, ప్రాసెసింగ్, పారిశుద్ధ్య నిర్వహణలో కాకినాడ దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది. జగన్ ప్రభుత్వం ఈ వాహనాలు తీసుకొచ్చాక పారిశుద్ధ్య విభాగంలో మెరుగైన ర్యాంకు సాధించాల్సి ఉండగా, దిగువకు పడిపోయింది.

కార్మికులకే రాయితీపై ఇచ్చేలా..

నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు రాయితీపై వాహనాలు సమకూర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థికాభివృద్ధి సంస్థ (నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) ద్వారా చెత్త సేకరణ వాహనాలు ఇప్పించనున్నారు. బ్యాంకు రుణం, రాయితీతో కలిపి, కార్మికులకు ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రస్తుతం 105 ప్రైవేటు వాహనాలు ఉన్నాయి. వీటితో పనిలేకుండా సొంత వాహనాలు సమకూర్చుకోవాలని చూస్తున్నారు. కొన్నింటిని ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ద్వారా, మరికొన్ని సీఎస్ఆర్ నిధులతో కొనాలని ప్రతిపాదించారు.

ఏం చేయబోతున్నారు..

15వ ఆర్థిక సంఘం నిధులతో రెండుచోట్ల గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్స్ (చెత్త తరలింపు కేంద్రాలు) ఏర్పాటుకు ప్రతిపాదించారు. రూ.ఏడు కోట్లతో బొండగుంట వద్ద, రూ. 2.75 కోట్లతో ఏటిమొగ వద్ద వీటిని నెలకొల్పనున్నారు. ఇక్కడ తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను విభజించి, ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలిస్తారు. త్వరలో ఏర్పాటు చేయనున్న ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా సంపద సృష్టించాలని భావిస్తున్నారు. సీఎన్జీ గ్యాస్, ఇతర ఉత్పత్తులను తయారు చేసి, కార్పొరేషన్‌కు ఆదాయం చేకూరేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.20 లక్షలతో పుష్‌కార్టులు, 60 లీటర్ల సామర్థ్యం ఉన్న డబ్బాలను కొనుగోలు చేయనున్నారు. వీటికి ఇప్పటికే టెండరు పిలిచారు. మరమ్మతులకు గురైన అయిదు కాంపాక్టర్ వాహనాలను సిద్ధం చేస్తున్నారు.

అనుమతి తీసుకుంటాం..

ప్రైవేటు వాహనాల నిర్వహణ భారంగా మారింది. సొంతంగా కొనాలని నిర్ణయించాం. పారిశుద్ధ్య సామగ్రికి కలెక్టర్ ద్వారా రూ.35లక్షలు ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు ఇవ్వనున్నారు. నగరపాలక సంస్థ ఖజానాపై భారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతి తీసుకుంటాం.
- భావన, కమిషనర్

ఆలయ అభివృద్ధికి శ్రీకారం

గాంధీనగర్: మెయిన్‌రోడ్డులోని పురాతన, ప్రసిద్ధి చెందిన శ్రీసీతారామస్వామి ఆలయ అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ విడుదల చేసిన రూ.70లక్షల సీజీఎఫ్ నిధులతో గర్భాలయ శిఖరాల పునఃనిర్మాణంతో పాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. వీటికి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగర తెదేపా అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జీ, చిక్కాల అబీ, ఆలయ ధర్మకర్తలు పులవర్తి సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి, జ్యోతుల నవీన్ తదితరులు

సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: లారీ యజమానుల సంఘ నాయకులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని అమలాపురం లారీ యజమానుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నల్లం రాంబాబు, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఉమ్మడి జిల్లాలోని 29 సంఘాల యూనియన్ నాయకులు సత్కరించారు. స్థానిక సంజయ్‌నగర్ లారీ యజమానుల సంఘ కార్యాలయంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే ఉమ్మడి జిల్లా పరిధిలో యూనియన్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యలపై చర్చిస్తామన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శ్రీనివాసరావు, అల్లం రాజు, కోశాధికారి గణేసుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరిగెల్ల రంగబాబు, కేవీ అర్జునరావు, చిట్నిని సత్యనారాయణ, ఉద్దా శ్రీనివాస్, కాండ్రేగుల సతీష్, యలమంచిలి సత్తిబాబు, జేఎస్ తదితరులు పాల్గొన్నారు. బలభద్రపురం, రాజమహేంద్రవరం, రాజోలు లారీ యజమానుల సంఘం నాయకులు సుధాకరరెడ్డి, బాబు, కాయల రమేష్, బొక్కా త్రిమూర్తులు తదితరులు సంఘీభావం తెలిపారు.


కార్యవర్గాన్ని సత్కరిస్తున్న జిల్లా సంఘ నాయకులు

'మాలల ఐక్యత సభ' జయప్రదం చేయాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: మాలల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కనెల 12న కాకినాడలో నిర్వహించనున్న మాలల ఐక్యత సభను జయప్రదం చేద్దామని తెదేపా ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేయాలని ఎస్.అచ్యుతాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. రిజర్వేషన్ల పెంపు, వాటి పరిరక్షణకు మాలలు ఐక్యంగా ఉండాలన్నారు. మహాసేన రాజేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఐక్యత సభకు అధిక సంఖ్యలో రావాలన్నారు. నాయకులు బచ్చల నరేష్, గుడాల అచ్చారావు, కొల్లాబత్తుల ప్రసాద్, సలాది కృష్ణ, సుందరపల్లి జీవీ, తేజ, సంతోష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న అప్పారావు, తదితరులు

కలెక్టర్‌ను కలిసిన డీపీవో సుబ్బరాజు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిగా డా. కేవీ సుబ్బరాజు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్‌తో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గుంటూరు డీపీవోగా పనిచేసి బదిలీపై కాకినాడ వచ్చారు.



నాగశివలింగం ప్రతిమ అపహరణపై కేసు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి శివాలయ కోనేరు ఆవరణలో నాగశివలింగం ఏకశిలా ప్రతిమ చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేయాలని ఆధ్యాత్మిక ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో గత సోమవారం కలెక్టర్‌ను కోరారు. ఆ మేరకు బుధవారం కాకినాడ రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. టుటౌన్ సీఐ అప్పలనాయుడు విచారణ ప్రారంభించారు. పోలీసులు రమణరాజు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. దేవాదయ శాఖ బాధ్యత వహించాలన్నారు. నాలుగు నెలల క్రితం ప్రతిమ చోరీకి గురైనట్లు సమాచారం.

వీణాపాణి.. హంసవాహిని..


పెద్దశివాలయంలో..


బాలాత్రిపుర సుందరి అమ్మవారు


వార్ఫురోడ్డు వినాయక సాగర్ వద్ద విజయకనకదుర్గాదేవి


సరస్వతిగా సంతచెరువు కనకదుర్గాదేవి

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం జరిగాయి. సామూహిక సరస్వతి పూజల్లో సుమారు 2,000 మంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారు రక్తబీజాక్షుని వధించే అవతారంలో దర్శనమిచ్చారు. సంతచెరువు వద్ద కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో అమ్మవారిని కనకదుర్గగా అలంకరించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. మాధవనగర్‌లోని శ్రీకనకదుర్గా ఆలయంలో అమ్మవారు స్కంధమాతగా దర్శనమిచ్చారు. భానుగుడి సెంటర్‌లోని ఉషాబాలాత్రిపుర సుందరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవి అవతారంలో అలంకరించి, సామూహిక పూజలు చేశారు. అశోక్‌నగర్ శిర్డీసాయి మందిర్‌లో మహాచండీ హోమాన్ని నిర్వహించారు. రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద గల కనకదుర్గ ఆలయంతోపాటు, సూర్యనారాయణపురం, అచ్యుతాపురం, గాంధీనగర్, బాలాజీచెరువు, వెంకట్‌నగర్, వార్ఫురోడ్డు, శ్రీరామ్‌నగర్, శారదాంబ ఆలయం వంటి ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో పూజలు, సామూహిక సరస్వతి పూజలు, కుంకుమార్చనలు జరిగాయి.


బాలాత్రిపుర సుందరి ఆలయంలో..


పెద్ద శివాలయంలో సరస్వతి పూజల్లో విద్యార్థులు

విద్యార్థులకు అట్టలు, పెన్నుల పంపిణీ

కాకినాడ నగరం: యంగ్‌మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో కొండయ్యపాలెం నూకాలమ్మ ఆలయంలో బుధవారం విద్యార్థులతో సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ 300 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల అట్టలు, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షల్లో రాణించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

దీపాలు వెలిగాయోచ్ (స్పందనకు వందనం)



స్థానిక రేచర్లపేట పచ్చిపాల వారి వీధిలో వీధి దీపం కొన్ని రోజులుగా వెలగట్లేదు. దీనిపై ఆ ప్రాంతానికి చెందిన సంతోష్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను నగరపాలక సంస్థ ఏఈ సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

బస్సు తిప్పట్లేదు.. **సమస్య:** కాకినాడ నుంచి ఉప్పాడ వెళ్లే బస్సును పాఠశాల సెలవు రోజుల్లో ఆపేస్తున్నారు. పండూరు, గోర్స, కొమరగిరి, కొత్తపల్లి మీదుగా ఉప్పాడకు ఈ బస్సు రోజుకు రెండుసార్లు తిరుగుతుంది. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- బి.కొండలరావు, ప్రయాణికుడు**

సమాధానం: ఉప్పాడ రోడ్డు గుంతల కారణంగా కొన్నిరోజులు నిలుపుదల చేశాం. సోమవారం నుంచి బస్సు పునరుద్ధరిస్తాం. సెలవు రోజుల్లో తిరిగేలా చర్యలు తీసుకుంటాం.
- ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ కమిషనర్, కాకినాడ డిపో

భక్తుల ఇక్కట్లు.. బాల త్రిపుర సుందరి అమ్మవారి దేవాలయంలో దర్శనం కోసం సామాన్య భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. స్పెషల్ దర్శనాలు, వీఐపీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. **- స్థానికులు**

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
సాంబమూర్తినగర్: 91548 46719

21 కిలోల గంజాయి స్వాధీనం

దేవరాపల్లి(అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం పినకోట - దేవరాపల్లి మార్గంలో కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై మల్లేశ్వరరావు తెలిపారు. కారుతో పాటు 21 కిలోల గంజాయి, రూ.2,600 నగదు, చరవాణి స్వాధీనం చేసుకున్నామన్నారు. కాకినాడ నగరానికి చెందిన బొడ్డపాటి తేజ కిరణ్, పులపాకాళి కిరణ్ దత్త సాయి, చెవ్వాకుల రేణుక కలిసి పెదబయలు మండలం జామిగుడ సరిహద్దులోని ఒడిశాలో 21 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. దీన్ని పినకోట, దేవరాపల్లి మీదుగా కారులో తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. సోదా చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను చోడవరం కోర్టులో హాజరు పరిచామన్నారు.



సిగ్నల్ అలంకారప్రాయం.. చోదకుల ఇష్టానుసారం

కాకినాడ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన కూడలిల్లో ఒకటైన సర్పవరం కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ దీపాలు వెలగట్లేదు. కొన్ని నెలలుగా పనిచేయక అలంకారప్రాయంగా మారాయి. ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులతో కూడలి పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ఈ క్రమంలో వాహన రాకపోకలను సరిదిద్దడం ట్రాఫిక్ పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. గందరగోళ పరిస్థితుల్లో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
– ఈనాడు, కాకినాడ

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

కాకినాడ నగరం: నారా లోకేశ్ ఫౌండేషన్ ద్వారా 'అన్న జనార్దన్ క్యారేజ్' పేరుతో 862 రోజులుగా పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని తెదేపా నేత, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు బుధవారం హైదరాబాద్‌లో జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన అన్నదాన క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు వివరించారు.

జేఎన్‌టీయూకేలో ప్రొఫెసర్ హోదాపై వివాదం
కోర్టుకు రావాలని ఇన్‌ఛార్జి వీసీకి నోటీసులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకేలోని గ్రంథాలయ విభాగంలో పనిచేస్తున్న దొరస్వామి నాయక్‌కు ప్రొఫెసర్ హోదా వివాదం తారస్థాయికి చేరింది. వివరాల్లోకి వెళ్తే.. తనకు అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రొఫెసర్ హోదా ఇవ్వాలని దొరస్వామి గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. గత వీసీలు ఈ అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో ఆయన 2021లో నేషనల్ కౌన్సిల్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్ (ఎన్‌సీఎస్‌టీ)ను ఆశ్రయించారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని జేఎన్‌టీయూకే అథారిటీ, ఉన్నత విద్యాశాఖను ఎన్‌సీఎస్‌టీ అప్పట్లోనే ఆదేశించింది. దీనిపై కమిటీ వేసి, పాలకమండలిలో తీర్మానించాక హోదా ఇస్తామని అప్పట్లో సంజాయిషీ ఇచ్చారు. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేకపోవడంతో తిరిగి 2023లో ఆయన ఎన్‌సీఎస్‌టీని ఆశ్రయించారు. తాజాగా ఆగస్టులో మరోసారి ఫిర్యాదు చేశారు. ఎన్‌సీఎస్‌టీ దీనిపై స్పందించింది. దిల్లీలోని ట్రైబ్ కోర్టుకు హాజరు కావాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతికి బుధవారం నోటీసులు జారీ చేసింది.

రౌండ్‌టేబుల్ సమావేశం రేపు

గాంధీనగర్, న్యూస్‌టుడే: పాలస్తీనాలో గాజా ప్రజలపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభమై ఏడాది అవుతోంది. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా శాంతిని కోరుతూ కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, సీహెచ్. రాజ్‌కుమార్‌లు తెలిపారు. యుద్ధంలో వేలమంది చిన్నారులు, మహిళలు చనిపోయారన్నారు. సుమారు 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారన్నారు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ శాంతిని కోరుకునే వారంతా రావాలన్నారు.

ఆహ్లాదం ఆవిరి

అలసిపోయిన నగరజీవికి ఉద్యానాలు ఉల్లాసాన్ని ఇస్తాయి. అలాంటి ఉద్యానాలు కనీస నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ సినిమా రోడ్డులోని సంతచెరువు ఉద్యానంలో సమస్యలు తిష్ఠ వేశాయి. నగరం నడిబొడ్డున ఉండటంతో చాలామంది ఇక్కడకు రోజూ వస్తుంటారు. పూర్తిస్థాయిలో సదుపాయాలు లేక నగరవాసులు ఉసూరుమంటున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఉంటుంది. దీనికి ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో పొరపాటున అందులో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆటపరికరాలన్నీ మూలకు చేరాయి. మంచినీరు సదుపాయం పూర్తిస్థాయిలో లేదు. పలు వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. చెరువు చుట్టూ ఉన్న విద్యుత్తు స్తంభాలకు విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు స్పందించి, ఉద్యానాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మసీదు సెంటర్


వ్యాయమ పరికరాలు


చెరువు చుట్టూ రక్షణ లేకుండా ఇలా..


వేలాడుతున్న విద్యుత్తు తీగలు

పేరు:	సంతచెరువు ఉద్యానం
వచ్చే ప్రాంతాల వారు:	పెద్ద మార్కెట్, చిన్న మార్కెట్, సూర్యానారాయణపురం, మెయిన్ రోడ్డు, సినిమారోడ్డు, రాగంపేట, జ్యోతుల మార్కెట్‌కు వచ్చేవారు
రోజుకు వచ్చేవారు:	సుమారు 400 మంది
ఆదివారం వచ్చేవారు:	సుమారు 600 మంది

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండలంలో ఉపాధి హామీ పనిదినాలు 2,64,000 ఉండగా ఇప్పటి వరకు 2,22,000 పని దినాలు కల్పించామని, మరో 5 నెలల సమయం ఉండగా టార్గెట్ పెంచి సుమారు 4,06,000 లక్ష్యం పూర్తిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. సర్పవరం జంక్షన్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆమె ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలి

సామర్లకోట, న్యూస్‌టుడే: ప్రయాణికులకు నాణ్యమైన ఆహార పదార్థాలనే విక్రయించాలని సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ సూచించారు. బుధవారం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాల్లో భాగంగా ఆహార పదార్థాల నాణ్యత, విక్రయాలు, దుకాణాలను ఆయన అధికారులతో కలిసి తనిఖీచేశారు. ఫుడ్ ప్లాజా, పండ్ల దుకాణాలు, రసాల స్టాళ్లు, ప్లాట్‌ఫారాలపై ఉన్న తినుబండారాలను పరిశీలించారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీగిరి, ఆర్పీఎఫ్ ఎస్సై రామకృష్ణ, టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, జూనియర్ ఇంజినీర్ నాగార్జున తదితరులు ఉన్నారు.

ధాన్యం అమ్మకాలకు అనుమతించాలని వినతి

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు మండలాల రైసుమిల్లులకు స్థానిక రైతులు ధాన్యం అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందించారు. కాకినాడ జిల్లాలో రైసుమిల్లులు తక్కువగా ఉండటం.. అవి మండలానికి దూరంగా ఉండడంతో సమస్యగా మారిందని రైతుల నుంచి అభ్యర్థనలు రాగా ఈ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

దీపావళికి వంటింట్లో వెలుగు

ఉచిత గ్యాస్ సిలిండర్లపై కసరత్తు



పిఠాపురం, పెద్దాపురం, న్యూస్‌టుడే: దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీకి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ వినియోగదారుల వివరాలను ఆరా తీస్తున్నారు. పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం పట్టణాలతో పాటు వాటి పరిధిలోని పంచాయతీ గ్రామాల వారీగా లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. దీపం, ఉజ్వల, సీఎస్ఆర్, జనరల్ ఇలా ఏ విభాగంలో ఎంతమంది ఉన్నారో లెక్కలు తేల్చుతున్నారు. మరోపక్క రేషన్‌కార్డులు ఉన్న కుటుంబాలు, ఉజ్వల్, దీపం పథకాల లెక్కలు వేర్వేరుగా సేకరిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి ఉచిత గ్యాస్ సరఫరా ఏ విధంగా చేయాలనే విషయాలపై చర్చిస్తున్నారు. దీపావళి నుంచే ఉచిత సిలెండర్లను అందిస్తారనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో మహిళలు పథకం అమలుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు మండుతున్న నేపథ్యంలో ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం కాస్త ఊరట నిస్తుందని భావిస్తున్నారు.

గ్యాస్ వివరాలు	హెచ్‌పీ	భారత్ గ్యాస్	ఇండేన్
పెద్దాపురం పట్టణం	16,000	1,800	--
పిఠాపురం పట్టణం	18,883	--	4,434
సామర్లకోట పట్టణం	9,000	--	1,200
గొల్లప్రోలు	3,833	--	16,693
కొత్తపల్లి	7,363	--	7,000

అదనపు భారం తగ్గుతుంది..



ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో దీపావళి నుంచి గ్యాస్ అందించడం ఎంతో ఆనందదాయకం. నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో మూడు గ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇవ్వడం ఎంతో ఊరటనిస్తుంది. మాలాంటి కుటుంబాలకు అదనపు భారం తగ్గుతుంది.

- మడికి శేషమ్మ, బ్రౌన్‌పేట, సామర్లకోట

ఇది మంచి పథకం..



ఏడాదికి మూడు సిలెండర్లు ఉచిత పథకంతో మాలాంటి వారికి ఎంతో ప్రయోజనం. ఈ పథకం అమలుతో ఏడాదికి రూ. 2,400 వరకు లబ్ధిపొందుతాం. ఈ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎప్పటి నుంచి చేస్తారోనని ఆశగా చూస్తున్నాం.

- అల్లు శాంతి దేవిక, పెద్దాపురం

సద్వినియోగం చేసుకుంటా..



వచ్చే దీపావళి నుంచి ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇవ్వడం మంచి పరిణామం. దీనివల్ల డబ్బు ఆదా అవుతుంది. మహిళల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుండడం సంతోషదాయకం.

- పి.లోవకుమారి, పెద్దాపురం

ఉచిత గ్యాస్ ఇస్తే ఆనందమే



ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ అందిస్తారని ఎదురుచూస్తున్నాం. దీపావళికి అందిస్తారని ప్రకటనలు చూస్తూ ఆనందిస్తున్నాం. మూడు సిలిండర్లు ఇస్తే పేద కుటుంబాలపై వంటింటి కష్టాలు తగ్గుతాయి. మహిళలంతా కూడా ప్రభుత్వం ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. గ్యాస్ కొనాలంటే చాలా కష్టమవుతోంది. ప్రభుత్వం భారం తగ్గిస్తుందని ఆశిస్తున్నాం.

- రాయుడు రాఘవమ్మ, గుట్లవీధి, పిఠాపురం

కొబ్బరిబొండంపై కనకదుర్గ చిత్రం

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు కొబ్బరిబొండంపై కనకదుర్గ అమ్మవారి చిత్రం చెక్కారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా దసరా ప్రత్యేకతను బుధవారం వివరించారు.



గోవిందరాజులు చిత్రీకరించిన అమ్మవారి రూపం

మేమున్నాం.. మీకు తోడుగా

దోమల బెడదతో బెంబేలు

సమస్య: స్థానిక కొత్తపేటలో మురుగుకాలువల వ్యవస్థ సక్రమంగా లేదు. మురుగు నిలిచిపోయి దోమల బెడద అధికంగా ఉంటోంది. కాలువలను నిత్యం శుభ్రంచేసేలా చర్యలు తీసుకోవాలి. - రాజు, పెద్దాపురం

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలు వెంటనే శుభ్రం చేయిస్తాం. - కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

– న్యూస్‌టుడే, పెద్దాపురం

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కరప: రక్తహీనత సమస్య లేకుండా గర్భిణులు క్రమంగా పోషకాహారం తీసుకోవాలని వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.క్రాంతిసౌజన్య సూచించారు. కరప మండలం వేళంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఆమె ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల సూచనలు చేశారు. ఎంపీహెచ్ఈవో గోవిందబాబు, హెచ్ఎస్ రమణారావు, హెచ్‌వీ సూర్యకుమారి, కృష్ణశేఖర్ పాల్గొన్నారు.

కాలువలో నమూనాల సేకరణ

ఈనాడు కథనానికి స్పందన

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: వాకలపూడి ఏపీఐఐసీ పారిశ్రామికవాడ కాలువల్లో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఏఈ ఎ.రామచంద్రమూర్తి సిబ్బందితో నీటి నమూనాలు సేకరించారు. 'ఈనాడు'లో బుధవారం 'అడిగేదెవరు.. ఇలానే వదిలేస్తాం' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పారిశ్రామికవాడలోని పలు ప్రాంతాల్లో నమూనాలు సేకరించారు. వీటిని పరీక్షించి శుద్ధిచేయకుండా కాలువల్లోకి వదిలినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏఈ రామచంద్రమూర్తి తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజ



చీరలు, దుప్పట్లు పంపిణీచేస్తున్న క్లబ్ ప్రతినిధులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజలో ఉందని క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ అన్నారు. గొల్లప్రోలు క్లబ్ ఆధ్వర్యంలో చిన జీయర్ స్వామి శిష్య బృందంతో మహిళల ఆరోగ్య సమస్యలపై వైద్య శిబిరం, సేవా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన మహిళలను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. పేదలకు చీరలు, దుప్పట్లు, బియ్యం, పంపిణీచేశారు. గోవులకు దాణా అందించారు. క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ కుసుమంచి పాపారావు, గవర్నర్ సుభాష్, సెక్రటరీ పేకేటి సతీష్, వెలగా నగేష్, బుచ్చిరాజు, రీజనల్ ఛైర్మన్ కంతేటి లక్ష్మీనారాయణ, వైస్ గవర్నర్ బంగార్రాజు, జోన్ ఛైర్మన్ దంగేటి శ్రీరామకృష్ణ, డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ గ్రంధి లచ్చన్న, మూర్తి, సత్యనారాయణ, వివిధ గ్రామాల క్లబ్ అధ్యక్షులు, సభ్యులు, ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీఎంగా సన్యాసిరావు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు (ఏపీఎం)గా సన్యాసిరావు చేబ్రోలులోని స్త్రీశక్తి భవనంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన అరుణ పెదపూడి మండలానికి బదిలీకావడంతో తాళ్లరేవు నుంచి బదిలీపై ఆయన వచ్చారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

కరప, న్యూస్‌టుడే: దాతలు స్వచ్ఛంగా ఏర్పాటుచేస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జనసేన నాయకుడు వీరంరెడ్డి ముత్యాలరావు సూచించారు. కరప మండలం గొడ్డటిపాలెంలో బుధవారం ఫెయిత్ ఫెలోషిప్ చర్చ్ మినిస్ట్రీస్ మతబోధకుడు కె.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు రూ.3 లక్షల విలువ చేసే మందులను అవసరమైన రోగులకు అందజేశారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, వాసంశెట్టి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుస్తాం..



ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, రామస్వామి

పెద్దాపురం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం దివ్యాంగులను పూర్తిగా విస్మరించిందని, కూటమి ప్రభుత్వంలో వారి అవసరాలు తీర్చడంతో పాటు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఎంపీపీ కార్యాలయ ఆవరణలో సామాజిక సాధికారత శిబిరంలో భాగంగా బుధవారం నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉపకరణాలను ఆయన పంపిణీ చేశారు. ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసినా అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. భాజపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి విత్తనాల వెంకటరమణ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంకా వైకాపా నాయకుల బెదిరింపులు, హవా కొనసాగుతున్నాయన్నారు. అనంతరం 279 మందికి 351 ఉపకరణాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీలలిత, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు మాట్లాడారు.

షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన..

మరిడమ్మ ఆలయ గోపురం ముందు షెడ్ నిర్మాణానికి దాతలు అందించిన రూ.20 లక్షలతో చేపట్టనున్న పనులను ఎమ్మెల్యే చినరాజప్ప శంకుస్థాపన చేశారు. వారపుసంతలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటుపై వ్యాపారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. దేవాలయం ఈవో విజయలక్ష్మి, వంశపారంపర్య ధర్మకర్తల మండలి ఛైర్మన్ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం, సామర్లకోట పట్టణ తెదేపా అధ్యక్షులు రంధి సత్యానారాయణ, అడబాల కుమారస్వామి నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన

గొల్లప్రోలు: ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీ, నివాస గృహాల మధ్యలో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను శివారుకు తరలించేందుకు అవసరమైన స్థలాన్ని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు బుధవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. డిప్యూటీ తహసీల్దారు బి.నాగసౌజన్య, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం అందించండి

కాజులూరు: దసరా సెలవులకు గ్రామాంతరాలు వెళ్లేవారు ముందస్తు సమాచారం అందించాలని గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ కోరారు. బుధవారం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ బంధువుల ఇళ్లకు వెళ్లేవారు చుట్టు పక్కల వారికి, గ్రామంలో తెలిసిన వారికి తెలియపరచాలన్నారు. ఊరు శివార్లో ఉన్నవారు పోలీసులకు సమాచారం అందించి వెళ్లాలన్నారు. విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదన్నారు. ఎవరైన గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

గుంతలమయం.. ప్రమాదకరం



గొల్లప్రోలులోని మార్కెట్ గుంతలమయంగా మారి మురుగు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ పక్కనే రక్షిత నీటి ప్రాజెక్టు ఉండడంతో వృథా నీరు మార్కెట్ రోడ్డుపైకి చేరుతోంది. దీంతో నిత్యం బురదమయంగామారి మార్కెట్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యలో సిమెంటురోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదనలు గతంలో రెండు దఫాలు చేసినా కార్యరూపం దాల్చలేదు. మార్కెట్ అభివృద్ధికి చర్యలు చేపట్టడంతోపాటు సిమెంటురోడ్డు నిర్మించి ప్రజలు, చిరువ్యాపారుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతున్నారు. దీని గురించి నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్‌రావును అడుగగా గుంతలు పూడ్చి మరమ్మతులు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

మొరాయించిన చెత్త వాహనం



చెత్త సేకరించే వాహనాల పరిస్థితి ఇలా ఉంటే పారిశుద్ధ్య పరిస్థితి ఎపుడు మెరుగుపడుతుందని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. వారపుసంతలో కూరగాయల వ్యాపారులకు కేటాయించేందుకు తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విచ్చేశారు. అప్పటికే చెత్తను సేకరించి.. తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్ అడ్డుగా ఉండడంతో దాన్ని పక్కకు తీయాలని అధికారులు, నాయకులు డ్రైవరుకు సూచించారు. అయితే సెల్ఫ్ మోటార్‌లేకపోవడంతో ట్రాక్టర్ ముందుకు కదల్లేదు. దీంతో ఎమ్మెల్యే ఎదుటే పారిశుద్ధ్య కార్మికులే తలో చేయివేసి వాహనాన్ని తోసి పక్కనపెట్టారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

సరస్వతీ నమస్తుభ్యం

చదువుల తల్లిగా దుర్గమ్మ దర్శనం



తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అక్షరాలు దిద్దిస్తున్న వేదపండితుడు ప్రభాకరశాస్త్రి



దుర్గాడ శివాలయంలో లలితామాతకు పెన్నులదండ



సరస్వతీదేవిగా రాజరాజేశ్వరి



రాపర్తిలో చదువులతల్లిగా..



కాండ్రకోటలో నూకాలమ్మ



బాలాత్రిపుర సుందరి



అయోధ్యరామపురం కనకదుర్గ ఆలయంలో..

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: తాటిపర్తిలోని అపర్ణాదేవిని సరస్వతి అలంకరణలో బుధవారం తీర్చిదిద్దారు. ఈ సందర్భగా సరస్వతిమాతకు ప్రత్యేక పూజలుచేసి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. దుర్గాడ శివాలయంలో లలితామాతను సరస్వతిదేవిగా అలంకరించి పెన్నుల మాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు వాటిని పంపిణీచేశారు.

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. పదో శక్తి పీఠం పురూహూతిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాపర్తిలోని దుర్గమల్లేశ్వరి, పి.రాయవరంలో దుర్గమ్మతల్లికి సరస్వతీదేవి అలంకారం చేశారు. పిఠాపురం కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో సరస్వతీదేవి పూజలు పూజలు నిర్వహించారు.

* పాదగయ క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, వంగా గీత ప్రత్యేక పూజలు చేశారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి, పురూహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను దర్శించుకున్నారు. .

పెద్దాపురం: పట్టణంతో పాటు గ్రామాల్లోని దుర్గమ్మ, మరిడమ్మ, నూకాలమ్మ దేవాలయాల్లో బుధవారం అమ్మవార్లను శ్రీమహాసరస్వతిగా తీర్చిదిద్దారు. పురపాలక సంఘం సెంటర్, సినిమా సెంటర్, వరహాలయ్యపేట, రామారావుపేట, కొండయ్యపేట, కుమ్మరవీధి, బంగారమ్మ గుడివీధి, పాత ప్రభుత్వాసుపత్రివీధి, గణేష్‌నగర్‌కాలనీ, బొమ్మలగుడివీధి, వర్జులవారివీధిలోని భువనేశ్వరి పీఠంలో చండీ హోమం నిర్వహించారు.

పెదపూడి: దుర్గాదేవి ఆలయాల్లో సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో అర్చకులు కె.వెంకట్రావు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. జి.మామిడాడ శివారు శ్రీ వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో సరస్వతీదేవి విగ్రహం పూజలు చేపట్టారు.

కరప: కరపలోని శ్రీపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి, పెనుగుదురులోని శ్రీరుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో బుధవారం విద్యార్థులు సామూహిక సరస్వతి పూజల్లో పాల్గొన్నారు.



శ్రీపీఠంలో సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

తాళ్లరేవు: మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో సరస్వతీ పూజల్లో విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాతకోరంగి, తాళ్లరేవు వాసవి మాత ఆలయంలో పెన్నులు పంపిణీ చేశారు.

సర్పవరం జంక్షన్: శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక బుధవారం భక్తులకు హంస వాహనంపై వీణాపాణిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతితో పాటు ప్రముఖ కవి, ఆధ్యాత్మికవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అమ్మవారిపై చేసిన అనుగ్రహభాషణం ఆద్యంతం ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 30 వేల మంది మహిళలు అరుణవర్ణం ఏకరూప దుస్తులతో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.



జి.మామిడాడ వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు



జొన్నవిత్తుల దంపతులకు సత్కారం

సామర్లకోట: పంచారామ క్షేత్రం చాళుక్య కుమార రామా భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు బుధవారం సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యోగలింగమూర్తి భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అయోధ్యరామపురం కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పెదపూడి: పెదపూడి మండలం పుట్టకొండ శక్తి పీఠంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీనవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆయన వెంట కూటమి నాయకులు జుత్తుక సూర్యకుమారి, కేతా సత్యనారాయణ, ఆర్.నాగు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు రేపు

తాళ్లరేవు: ప్రభుత్వ నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ, లాటరీ పద్ధతుల్లో మార్పులు చోటుచేసుకున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక తెలిపారు. తాళ్లరేవు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆమె బుధవారం సందర్శించి మాట్లాడారు. కాకినాడ జిల్లా, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 13 స్టేషన్ల పరిధిలో కాకినాడలో 1349, కోనసీమలో 2042 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ, 14వ తేదీన లాటరీ పద్ధతి మద్యం దుకాణాలు కేటాయింపు ఉంటుందన్నారు. 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సీఐ కోటేశ్వరరావు, కె.వి.స్వామి ఉన్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేయండి

పిఠాపురం: అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు కోరారు. బుధవారం పట్టణ పోలీసుస్టేషన్లో సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్‌లకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో ఇలాంటి దుశ్చర్య జరగడం బాధాకరమన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, దర్యాప్తు వేగంగా పూర్తిచేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మాదిగ న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షుడు పిల్లి బలరాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఆకుమర్తి దుర్గ, నియోజకవర్గం అధ్యక్షుడు పెదపాటి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి దేవరపు సురేష్, పట్టణ అధ్యక్షుడు గొడిచర్ల బాల, మండల అధ్యక్షుడు గొడత వీరబాబు, నియోజకవర్గం గౌరవ అధ్యక్షుడు పెదపాటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో ప్రొఫెసర్ హోదాపై వివాదం

● కోర్టుకు రావాలని ఇన్‌ఛార్జి వీసీకి నోటీసులు

గాంధీనగర్: జేఎన్‌టీయూకేలోని గ్రంథాలయ విభాగంలో పనిచేస్తున్న దొరస్వామి నాయక్‌కు ప్రొఫెసర్ హోదా వివాదం తారస్థాయికి చేరింది. వివరాల్లోకి వెళ్తే.. తనకు అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రొఫెసర్ హోదా ఇవ్వాలని దొరస్వామి గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. గత వీసీలు ఈ అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో ఆయన 2021లో నేషనల్ కౌన్సిల్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్ (ఎన్‌సీఎస్‌టీ)ను ఆశ్రయించారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని జేఎన్‌టీయూకే అథారిటీ, ఉన్నత విద్యాశాఖను ఎన్‌సీఎస్‌టీ అప్పట్లోనే ఆదేశించింది. దీనిపై కమిటీ వేసి, పాలకమండలిలో తీర్మానించాక హోదా ఇస్తామని అప్పట్లో సంజాయిషీ ఇచ్చారు. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేకపోవడంతో తిరిగి 2023లో ఆయన ఎన్‌సీఎస్‌టీని ఆశ్రయించారు. తాజాగా ఆగస్టులో మరోసారి ఫిర్యాదు చేశారు. ఎన్‌సీఎస్‌టీ దీనిపై స్పందించింది. దిల్లీలోని ట్రైబ్ కోర్టుకు హాజరు కావాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతికి బుధవారం నోటీసులు జారీ చేసింది.

15 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: నవంబరు 15 నుంచి 17 వరకు పెద్దాపురంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కోరారు. బుధవారం వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు స్మారక భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రధానమైన ఏలేరు ఆధునికీకరణ పనులు పూర్తిచేయకుండా రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక కొరత పెద్ద సమస్యగా మారిందన్నారు. ఆయా సమస్యలపై చర్చించడానికి మహాసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, కరణం ప్రసాదరావు, ఎస్.శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోపై చర్యలు ఎందుకు తీసుకోలేదు..?

పెద్దాపురం: కట్టమూరు గ్రామంలోని గ్రామకంఠం స్థలాన్ని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటనలో గతంలో పనిచేసిన వీఆర్వోపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోలేదని భాజపా రాష్ట్ర నాయకుడు బిక్కిన విశ్వేశ్వరరావు ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట విరుద్ధంగా వీఆర్వో కొంతమందికి పొసిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంతో దాంతో వారు రాజానగరంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. దీనిపై మూడు నెలల క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అప్పటి ఆర్డీవోకి ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గోదావరి కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

సామర్లకోట: సామర్లకోట-కాకినాడ మార్గంలోని గోదావరి కాలువ అయిదు తూముల సమీపంలో గుర్తుతెలియని 50 ఏళ్ల వయస్సున్న మహిళ మృతదేహాన్ని బుధవారం పోలీసులు వెలికితీశారు. స్థానికుల సమాచారంతో కాలువ ఒడ్డుకు చేరిన పోలీసులు పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టని స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి

మసీదుసెంటర్ (కాకినాడ): పురుగులమందు తాగి ఒకరు మృతిచెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లప్రోలుకి చెందిన వి.శివ(26) వ్యక్తిగత కారణాలతో పురుగు మందు తాగారు. తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ప్రథమచికిత్స అనంతరం మంగళవారం రాత్రి జీజీహెచ్‌లో చేర్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

టెట్‌కు 406 మంది హాజరు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన టెట్ పరీక్షకు 406 మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రో-ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం, మధ్యాహ్నం జరిగిన టెట్ పరీక్షకు మొత్తం 443 మందికి గాను 37 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధి

ప్రత్తిపాడు: అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో పనిచేయాలని ఎన్ఐఆర్‌డీపీఆర్(జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్) కన్సల్టెంట్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ధర్మవరం గ్రామంలో ఆయన పర్యటించారు. సచివాలయాలను సందర్శించారు. సర్పంచి సుశీల, పంచాయతీ కార్యదర్శి కామరాజు, సిబ్బంది ఉన్నారు.

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

పథకాల అమలుపై ఆరా

జగ్గంపేట గ్రామీణం: కేంద్రప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలు, అమలుజరుగుతున్న తీరును జాతీయ మానిటరింగ్ సిబ్బంది పరిశీలించారు. రామవరం, కాండ్రేగుల, మామిడాడల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పథకాల లబ్ధిని రైతులను అడిగి తెలుసుకున్నారు. బృందం సభ్యులు టి.వి.తిలకన్, సల్మాన్, డ్వామా ఏపీడీ భానుప్రకాష్, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'టెండర్లకు రాజకీయ ఒత్తిళ్లు లేవు'

తుని గ్రామీణం: మద్యం షాపుల టెండర్లు వేసే అభ్యర్థులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని ఆ మేరకు చర్యలు చేపట్టామని తుని ఎక్సైజ్ సీఐ పట్టాభిచౌదరి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తుని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పట్టణంతోపాటు నాలుగు మండలాల పరిధిలో 22 మద్యం దుకాణాలు కేటాయించారు. వీటి కోసం ఇప్పటి వరకు కేవలం 167 మంది మాత్రమే టెండర్లు వేశారన్నారు. ఐటీవల పలువురు వ్యాపారులు టెండర్లు వేయకుండా అడ్డుకున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. దీంతో నిరభ్యంతరంగా ఆసక్తి ఉన్నవారు 11వరకు టెండర్లు వేసేందుకు గడువు పెంచిందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వ్యర్థాల తొలగింపు



కిర్లంపూడి, న్యూస్‌టుడే: జగపతినగరం గ్రామం ఐటీవల వరద ముంపునకు గురైన సమయంలో ర.భ.రోడ్డు వెంబడి ఉన్న ముంపు కాలువలో పూడిక తొలగించి రోడ్డు వెంబడి వేశారు. దీనితోపాటు స్థానికులు వేసిన వ్యర్థాలు, చెత్త పోగుల వల్ల ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడకుండా వాటిని తొలగించే పనులను బుధవారం చేపట్టారు. పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో వ్యర్థాలను ట్రాక్టర్లపైకెక్కి గ్రామానికి దూరంగా తరలించారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పంచాయతీ సర్పంచి మహేంద్ర శ్రీలత, గ్రామనాయకుడు గుడాల రాంబాబు, వార్డు సభ్యులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

వీధిదీపాలకు మరమ్మతులు


జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాజపూడిలో నరసరావుపేట, సంతమార్కెట్ తదితర కాలనీల్లో వీధిదీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గ్రామ సర్పంచి భూసాల విష్ణుమూర్తి పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టారు. పలుచోట్ల కొత్త దీపాలు అమర్చి సమస్యను పరిష్కరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

దుస్థితిలో పుంత రోడ్లు.. రైతులకు పాట్లు

● ఏళ్లు గడుస్తున్నా కానరాని అభివృద్ధి

ఏలేశ్వరం, శంఖవరం, న్యూస్‌టుడే : పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులను అభివృద్ధి చేయడంలో వైకాపా పాలకులు నిర్లక్ష్యం వహించారని రైతులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 60 కి.మీ. పరిధిలో పుంత రోడ్లు ఉన్నాయి. ప్రధానంగా అన్నదాతల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఈ మార్గాలు నిర్వహణకు దూరమయ్యాయి. రైతులకు మాత్రమే కాకుండా ప్రయాణికులు ఈ రోడ్లను నిత్యం వినియోగిస్తారు. నారు మడులు సిద్ధం చేసే ప్రక్రియ మొదలు, పంట చేతికొచ్చే వరకు రైతులకు రోజూ అవసరమైన పుంత రహదారులు కనీసం నడిచేందుకు కూడా వీలుకాని దుస్థితిలో ఉన్నాయి.



లింగంపర్తి సమీపాన పుంత రహదారి దుస్థితి

యాతన నిత్యకృత్యం

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్నదాతల మేలుకి పుంత మార్గాలను ఏర్పాటుచేశారు. రైతులు, ఒక గ్రామం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే ప్రజలు పుంత దారులనే వినియోగిస్తారు. దశాబ్దాలు గడిచినా కనీసం గ్రావెల్, మెటల్‌తో కాని అభివృద్ధి చేయలేదు. ఈ క్రమంలో రైతులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు గాయపడుతున్నారు. ఎరువుల మూటలను తీసుకెళ్లే క్రమంలో రైతులు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. నాలుగు మండలాల పరిధిలోని దారులు ప్రగతికి ఆమడ దూరానే ఉన్నాయి. వానాకాలం వస్తే నీరు, బురదతో ఉన్న మార్గం మీద నుంచి వెళ్లాల్సి రావడంతో అవస్థలు తప్పవు.

ప్రమాదకరం

రైతు పొలాలను అనుసంధానిస్తూ నిర్మించిన పుంత మార్గాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలను దగ్గర చేసే ఏలూరు- భద్రవరం మధ్య ఉన్న రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు కిరువైపులా తుప్పలు పెరిగాయి. వర్షాకాలమంతా రహదారిపై నీరు తిష్ఠ వేస్తోంది. ఏలేశ్వరం మండలం చిన్నింపేట నుంచి పెద్దనాపల్లి వెళ్లే రోడ్డు తీరు ఇంతే. తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం, మర్రివీడు, తిరుమాలి, రమణయ్యపేటలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే పుంతలు రాకపోకలకు ఏ విధంగానూ ఉపయోగపడడం లేదని రైతుల ఉవాచ. శంఖవరం మండలం మాసంపల్లి నుంచి జి.కొత్తపల్లి మధ్య ఉన్న పుంత రోడ్డు పలు గ్రామాల రైతులకు రోజూ ఉపయోగమే. ఈ రోడ్డు రాళ్లు లేచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.



భద్రవరం పుంత దారి ... వర్షం వస్తే ఇంతే.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

పుంత మార్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుంటాం. ఏ పథకంలో ఈ మార్గాలను పునః నిర్మించాలో ఆలోచన చేస్తాం. అన్నదాతలకు అవస్థ లేకుండా చూస్తాం

- ఎం.సత్యనారాయణ, కమిషనర్, నగర పంచాయతీ, కేవీ సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ, ఏలేశ్వరం గ్రామీణ మండలం

బాణసంచా తయారీ కేంద్రం పరిశీలన

తుని: ఇసకపేటలో గతంలో బాణసంచా తయారు చేసిన కేంద్రాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు బుధవారం పరిశీలించారు. ఇక్కడ మందుగుండు తయారీకి ప్రస్తుతం ఏవిధమైన అనుమతులు లేవన్నారు. అక్రమంగా ఎవ్వరు తయారు చేయకూడదని స్పష్టం చేశారు. రూరల్ సీఐ చెన్నకేశవరావు తదితరులు ఉన్నారు. ● ముందస్తు అనుమతులు లేకుండా దీపావళి సామగ్రి తయారు చేస్తున్న వారి సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ కోరారు. లైసెన్సులు లేకుండా క్రయవిక్రయాలు చేయడం, గోడౌనులు, ఇళ్లల్లో దాచడం నేరమన్నారు. ఎవరైనా దొంగచాటుగా తరలిస్తున్నా తమకు 94407 96572 ఫోన్ నెంబరుకు సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



ఇసకలపేటలో తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

తైక్వాండో విజేతకు సన్మానం

తుని పట్టణం, న్యూస్‌టుడే: మలేషియాలో ఐటీవల జరిగిన అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ములపర్తి ప్రకాశరావును తుని ఆర్ యెన్సెక్ట్ అధ్వర్యంలో ఘనంగా బుధవారం సన్మానించారు. కొత్తవెలస మండలం కంటకాపల్లికి చెందిన ప్రకాశరావు ఆంధ్రప్రదేశ్ నుంచి మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించారన్నారు. సీనియర్ విభాగంలో బ్లాక్ బెల్ట్ కేటగిరి అండర్ 80 కేజీల విభాగంలో సత్తాచాటారన్నారు. తొలుత ప్రకాశరావు, ఆయన కోచ్ పి.రత్నాకర్‌రావులను తుని క్లబ్ సభ్యులు సత్కరించారు.



ప్రకాశరావు, రత్నాకర్‌లను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పారిశుద్ధ్య సిబ్బందికి సామగ్రి అందజేత


ఏలేశ్వరం: ఏలేశ్వరం రెండో వార్డుకి చెందిన తెదేపా నాయకుడు బంక రాజు బుధవారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను సేకరించేందుకు అవసరమైన 12 గమేళాలను సమకూర్చారు. కమిషనర్ ఎం.సత్యనారాయణ సమక్షంలో వీటిని సిబ్బందికి అందజేశారు. చెత్త ఎత్తేందుకు కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తన వంతు సాయం అందజేశానని బంక రాజు చెప్పారు. కమిషనర్ దాతను అభినందించారు.



ప్రత్తిపాడులో..



అన్నవరం: సరస్వతీ దేవిగా..



రౌతులపూడిలో..



లోవ తలుపులమ్మ

జ్ఞానేశ్వరీ.. జగదీశ్వరీ!

న్యూస్‌టుడే బృందం: దసరా నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లిగా పూజలందుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పెన్నులతో అమ్మవారి ముందు మోకరిల్లి జ్ఞాన సంపదను ప్రసాదించమని వేడుకున్నారు. అక్షరాభ్యాసాలు జరిగాయి. కిర్లంపూడి, రౌతులపూడిల్లో అమ్మవారికి ఊరేగింపుగా వచ్చి భక్తులు సారె సమర్పించారు. ఏలేశ్వరం 14వ వార్డులో దుర్గాదేవి మందిరంలో బుధవారం సరస్వతీ పూజ జరిగింది. విద్యార్థులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పుస్తకాలను అందజేశారు. మర్రిపాక అంగన్‌వాడి కేంద్రంలో బొమ్మలకొలువు పండగను ఘనంగా నిర్వహించారు.



జె.అన్నవరంలో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు

తప్పు కొందరిది.. ముప్పు అందరికీ..

మనకొక హైడ్రా ఉండాల్సిందేనా..!

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రంలో మునుపెన్నడు లేని ఈ ముంపు ఎందుకు? రోజుల తరబడి నీరు ఎందుకు కదలడం లేదు? అసలు ఈ నీరు ఎక్కడికి చేరాలి? ఈ ప్రశ్నలకు సమాధానం రావాలంటే హైడ్రా వంటి వ్యవస్థ ఉండి తీరాల్సిందేనా..? వానొస్తే కాలువల ద్వారా, పొలాల మీదుగా చెరువుకు చేరాల్సిన నీరు ఎందుకు కదలడం లేదు. ర.భ. రహదారిపై




అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఇదీ పరిస్థితి..



ప్రత్తిపాడు ఆర్అండ్‌బీ రోడ్డు కల్వర్టు మూసుకుపోయి నిలిచిన నీరు..

అగ్నిమాపక కేంద్రం నుంచి వంద మీటర్ల మేర ఈ ముంపు సమస్య ఉంది. ఎండకు ఇంకడం తప్ప మరో దారి లేదు. ఎగువ నుంచి వచ్చే నీరు ర.భ. కల్వర్టు ద్వారా.. గోవిందరాజులు చెరువుకు వెళ్లే కాలువ వెంబడి ప్రవహించాలి. ఆ దారులన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. గత పదేళ్లుగా ఈ సమస్య పెరుగుతూ వచ్చింది. ర.భ., జలవనరులశాఖ, పంచాయతీ, రెవెన్యూ యంత్రాంగం సమష్టిగా దృష్టిపెడితేనే ముంపు కథకు ముగింపు! ఎమ్మెల్యే తన ఇంటి నుంచి ఎటు వెళ్లినా మెయిన్ రోడ్డుపై ఉన్న ఈ నీటిని దాటాలి.

ఏళ్లుగా బోర్డులపై పాత వారి పేర్లేనా..?



ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీలు పూర్తయ్యాయి. అధికారులు బాధ్యతలు స్వీకరించి సమీక్షలూ చేస్తున్నారు. కానీ బోర్డులపై మాత్రం పాత అధికారుల పేర్లే ఉండడంతో కార్యాలయానికి వచ్చే సందర్శకులు గందరగోళానికి గురవుతున్నారు. ● జగ్గంపేట తహసీల్దారు కార్యాలయంలో సహ చట్టం బోర్డుపై గతంలో పనిచేసిన డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు రామిరెడ్డి, ఆర్డీవో జె.సీతారామారావు పేర్లూ ఉన్నాయి. ప్రస్తుతం జగ్గంపేటలో డిప్యూటీ తహసీల్దారుగా పార్థసారది, ఆర్డీవో రమణీలు కొనసాగుతున్నారు. ఇదే తీరున గండేపల్లి రెవెన్యూ కార్యాలయంలో బోర్డు పరిస్థితి ఉంది.

– న్యూస్‌టుడే, గండేపల్లి

అల్లుకున్న నిర్లక్ష్యం



జగ్గంపేట గ్రామీణ మండలంలోని సీతానగరంలో ర.భ రోడ్డును ఆనుకుని కల్వర్టు వద్ద విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. క్రింది నుంచి తీగలు వరకు పచ్చికతో స్తంభం కూడా కనిపించని రీతిలో చుట్టుకున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు, రైతులు విద్యుత్తు సరఫరా అంతరాయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్తంభం చుట్టూ తుప్పలను తొలగించి మెరుగైన విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

రోడ్డు అంచున ప్రమాదం



జగ్గంపేట గ్రామీణ మండలంలోని గొల్లలగుంటలో రోడ్డుపై వేసిన విద్యుత్తు స్తంభాలు ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. గ్రామంలో విద్యుత్తు లైన్ల కోసం తీసుకొచ్చిన స్తంభాలను నెలల తరబడి రోడ్డుపైనే వదిలేయడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో వీటిని గమనించకపోతే ప్రయాణికులు గాయాలపాలయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు తొలగించే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

తుని, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం ఉదయం సుదర్శన హోమం, అక్షరాభ్యాసం, సరస్వతీ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణం ఘనంగా జరిగింది.

తుని: పట్టణంలోని బెల్లపువీధిలో ఉన్న ఆర్యవైశ్య భవనం ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో శివలింగాల చుట్టూ అనేక మంది భక్తులు ప్రదక్షిణలు, పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య, అవోగా అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గత 15 రోజుల్లో 3 లక్షల శివలింగాలు తయారు చేసినట్లు సభ్యులు తెలిపారు.

గుబ్బాలమ్మ ఆలయం వద్ద చండీయాగం

గండేపల్లి: గండేపల్లి మండలం మురారి గ్రామంలోని బుధవారం గుబ్బాలమ్మ ఆలయం వద్ద తెదేపా నాయకుడు జాస్తి వసంత్, లక్ష్మిశ్రీదుర్గా దంపతులు చండీయాగం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నవీన్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సారా కాస్తున్న వ్యక్తి అరెస్టు


రౌతులపూడి: రాజవరం గ్రామానికి చెందిన వి.శ్రీనివాస్‌ను బుధవారం అరెస్టు చేశామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామ శివారున కొండ గెడ్డ వద్ద సారా కాస్తుండగా పట్టుకుని 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి వాడే సామగ్రిని ధ్వంసం చేసి అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదం.. కార్లు నుజ్జునుజ్జు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్రంపాలెం రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండుకార్లు నుజ్జునుజ్జయ్యాయి. రైసుమిల్లు సమీపంలో ఒక కారు కాల్వలోకి దూసుకువెళ్లగా మరో కారు ముందుభాగం నుజ్జయింది. ఈ రెండు కార్లు గుర్రంపాలెం వైపు నుంచి జగ్గంపేట వైపు వస్తున్నాయి. వేగంగా వచ్చిన కారు ముందు వెళుతున్న మరో కారును ఢీకొట్టగా కారులోని ఎయిర్‌బాగ్స్ సైతం తెరుచుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఏవిధమైన గాయాలు అవ్వలేదని ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇంటి నిర్మాణం తొలగింపులో ఉద్రిక్తత

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని వీరవరపుపేట ప్రాంతంలో గతంలో నిర్మించిన ఇంటిని తొలగించే చర్యల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికురాలు రమణమ్మ ఇంటి నిర్మాణ విషయంలో కొన్నేళ్లుగా న్యాయస్థానంలో వివాదం సాగుతోంది. ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించగా కేసు పలుమార్లు వాయిదాలు పడుతూ వచ్చింది. అయితే భవనాన్ని తొలగించేందుకు బుధవారం వెళ్లిన పురపాలక అధికారులను బాధిత కుటుంబసభ్యులు అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో వాగ్వాదం పెరిగింది. ఇంటి యజమాని రమణమ్మ పెట్రోలు సీసా చేతపట్టి ఉండగా, మహిళా కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించినట్లు ఆమె ఆరోపించారు. పోలీసులు కలుగజేసుకుని రోడ్డుపై బైఠాయించిన వారిని ఈడ్చి పక్కకు నెట్టారు. కోపోద్రిక్తులైన స్థానికులు అధికారులపై తిరగబడ్డారు. దీంతో చేసేది లేక అధికారులు, పోలీసులు వెనుతిరిగారు. దీనిపై పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా హైకోర్టు ఆదేశాలు అమలు చేసేందుకు వెళ్లామన్నారు. అయితే బాధితులు కొన్ని రోజులు సమయం కావాలని కోరడంతో వారి విజ్ఞప్తిని మన్నించామన్నారు. అక్రమ కట్టడం కూల్చివేతలో ఇబ్బందులు రాకుండా మరింత మంది పోలీసులను పంపాలని పెద్దాపురం డీఎస్పీకి లేఖరాస్తున్నామన్నారు. ఇదిలావుండగా శాంతియుతంగా ఉన్న తమపై పోలీసులు తమపై దౌర్జన్యం చేశారని, ఓ వ్యక్తికి గాయాలు కూడా అయ్యాయని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు.



వాగ్వాదానికి దిగడంతో చెదరగొడుతున్న పోలీసులు

అవీ ఇవీ అన్నీ

తెలుగుజాతి రత్నం ఎన్టీఆర్

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : తెలుగు జాతి ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరం గ్రంథాలయం వద్ద పట్టణ తెదేపా అధ్యక్షుడు, 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, అలమండ చలమయ్య, నాయకులు శిడగం శివ, మామిడి లలిత, కర్రి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమాలే ఊపిరిగా బతికారు..'

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: పేదలు, అణగారిన వర్గాలకు అండగా పోరాటాలు చేసిన నాగభూషణ్ పట్నాయక్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు బలపడాలని సి.పి.ఐ(ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రావు అన్నారు. పట్నాయక్ వర్ధంతి సందర్భంగా ప్రత్తిపాడులోని లిబరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు మానుకొండ లత్సబాబు తదితరులతో కలిసి నివాళులర్పించారు. ఉద్యమాలే ఊపిరిగా బతికిన పట్నాయక్ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేసుకున్నారు.

పండ్లతోటలకు రాయితీలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: దీర్ఘకాలం దిగుబడిని ఇచ్చే పండ్లతోటల పెంపకంపై రైతులు దృష్టిసారించాలని వీటికి ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు అందిస్తుందని ఉద్యానశాఖ అధికారిణి విజయలక్ష్మీ తెలిపారు. కుమ్మరిలోవ, కొలిమేరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్, స్థానిక నాయకులు జక్కాన రామునాయుడు, పోతల రాంబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

శంఖవరం: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని వ్యవసాయాధికారి గాంధీ అన్నారు. నెల్లిపూడి, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది'లో ఆయన రైతులతో మాట్లాడారు. పంట నమోదు, బీమా, పీఎం కిసాన్ తదితర అంశాలపై చర్చించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

రౌతులపూడి: బీబీపట్నం, లచ్చిరెడ్డిపాలెం, ఎన్.ఎన్.పట్నం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్ ఆయా గ్రామాల్లోని రైతులకు పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు.

అంబులెన్సులో ప్రసవం

రౌతులపూడి: పారుపాక గ్రామానికి చెందిన రెడ్డి నూకరత్నంకు బుధవారం అర్ధరాత్రి అంబులెన్సులోనే ప్రసవం జరిగింది. ఆమెకు పురిటినొప్పులు రావడంతో అంబులెన్సులో రౌతులపూడి సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అంబులెన్సు సిబ్బంది సుధాకర్, రాజబాబుకు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఉచితంగా మధుమేహ పరీక్షలు

తుని పట్టణం: పట్టణంలోని గణపతినగర్ పార్కు ఆవరణలో సిటీ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 70 మందికి ఉచితంగా మధుమేహ, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. వీరికి పలు సూచనలు అందించారు. వెల్లుల్లి, అల్లం, తేనె, తమలపాకులతో కిళ్లీలు, సబ్జా ద్రావణం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సోమేశ్వరరావు, ఎన్‌వీఎస్‌జె రాజు, ఎల్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందజేత

రౌతులపూడి, ప్రత్తిపాడు, శంఖవరం: రౌతులపూడి సామాజిక ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా బుధవారం గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు జానకీదేవి, సునీత, పావని తదితరులు 105 మందికి పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. గర్భిణులకు పైల నానాజీ కుటుంబసభ్యులు పోషకాహారం, భోజనం అందజేశారు. ● శంఖవరం పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. రాజా క్రీడామైదానంలో నియోజకవర్గంలోని 343 మంది దివ్యాంగులకు రూ.55 లక్షలు విలువైన 529 పరికరాలు బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతోమందికి భరోసాగా ఉంటుందన్నారు. ఇకపై మండల స్థాయిలోను శిబిరం ఏర్పాటు చేసి దివ్యాంగులకు కావాల్సిన పరికరాలు ఏమిటని గుర్తించి, త్వరగా వారికి కూడా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పరికరాలు అందజేసిన ఎమ్మెల్యే, నాయకులు

మోమున ఆనందం

వైకల్యంతో పుట్టినవారు కొందరైతే.. విధి వక్రించి ప్రమాదాల్లో దివ్యాంగులుగా మారిన వారు ఇంకొందరు.. గత వైకాపా పాలనలో వీరి అవస్థలు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగులు, మానసిక వైకల్యం ఉన్న వారికి పింఛన్ సొమ్ము పెరిగింది. వివిధ రకాల పరికరాలను అందజేస్తున్నారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారిలా..


ఇబ్బందులు తప్పాయి..



వైకల్యంతో ఉన్న నేను ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ప్రస్తుత ప్రభుత్వం ట్రైసైకిల్ అందించడంతో అవస్థలు తప్పాయి. ఇకపై రోజువారీ పనులు ఎవరిపైనా ఆధారపడకుండా బయటకు వెళ్లి నేనే చేసుకోగలను.

- ఎం.శ్రీలత, లబ్ధిదారు, తుని

సంతోషంగా ఉంది



ఎన్నికల సమయంలో ఇంటింటి ప్రచారానికి వచ్చిన యనమల దివ్యకి నా ఇబ్బందులు మొరపెట్టుకుని స్కూటీ కావాలని అడిగాను. అప్పట్లో ఆమె తప్పకుండా ఇస్తానని హామీ ఇచ్చారు. గెలిచిన కొద్ది కాలానికే మాట నిలబెట్టుకుని నాకు బ్యాటరీతో నడిచే విలువైన ట్రైసైకిల్ (బైక్) అందజేశారు.

- కె.హరీష్, విద్యార్థి, రాపాక